# ప్రశ్న



గంగుల నరసింహారెడ్డి

సూర్యుడు పడమటి కొండలచాటుకు తప్పుకున్నాడు. సంధ్య చీకట్లంతటా మందంగా అలుముకుంటున్నాయి. మేతకోసం వెళ్లిన పశువులు దొడ్లవైపుకు తిరిగివస్తున్నాయి. కూలీజనం పొలాల నుండి ఊళ్లోకు గుంపులు గుంపులుగా వస్తున్నారు.

ఊరికి దూరంగా వెలివేసినట్లున్న ఆ వాడలో చీకటే ఎక్కువగా ఉంది. కూలిపని నుండి వచ్చినవారు తమతమ గుడిసెల్లో వెలిగించిన బుడ్డిదీపాలు ఆ గుడిసెల్లోపలే అవసరమయినంత వెలుగును అందీయడంలేదు.

ఆ వాడలో అరవైదాకా గుడిసెలుంటాయి. జనం అంతా కలిసి రెండువందల పైన ఉంటారు. అందులో చాలామందికి కించిత్తు పొలంకూడా లేదు. ఉన్నవారికి అర ఎకరం, ఎకరంకన్నా ఎక్కువ లేదు. అందుకే వాళ్లంతా వ్యవసాయ కూలీలుగానే బ్రతుకుతున్నారు. మగవాళ్లల్లో చాలామంది ఆ ఊరి అగ్రకులస్తుల వద్ద జీతగాళ్లుగా పనిచేస్తున్నారు.

స్త్రీలు పొయ్యి అంటించి రొట్టెలు చేసే ప్రయత్నాలలో ఉంటే, మగవారు బాలిగాని ఇంటిముందు కూర్చొని, చుట్టలు త్రాగుతూ లోకాభిరామాయణం

---

**1982 చక్రపాణి మూడవ ఎవార్డు పొందిన కథ**

మాట్లాడుకుంటూ ఉన్నారు. పిల్లలు వెన్నెల కుప్పలు, కబడ్డీ, పుంగిరిపూత ఆడుకుంటూ అల్లరిచేస్తున్నారు.

సరిగ్గా ఆ సమయంలో—

"ఓర్నాయినో, ఓయమ్మో సంపింద్రో నా కొడుకు" అన్న గొంతు బాలిగాని ఇంటిముందు కూర్చున్న వారందరికి వినిపించాయి.

కొందరు అదిరిపడి చూశారు, మరి కొందరు అయోమయంగా చూశారు, ఇంకొందరు ఆశ్చర్యంగా చూశారు—వెనక్కి తలతిప్పి.

రక్తసిక్తమైన దేహంతో వారిలోకి వచ్చిపడ్డాడు రాములు.

లోకాభిరామాయణం నిలిచిపోయింది.

ఆటల అల్లరి చటుక్కున సద్దు మణిగింది.

రాట్టెలు చేస్తున్న చప్పుడు అర్థాంతరంగా ఆగిపోయింది.

అక్కడ కూర్చున్నవారిలో కొందరు లేచి రాముల్ని పట్టుకొని అరుగుమీద కూర్చోబెట్టారు.

పిల్లలక్కడికి ఉత్సుకతగా పరిగెత్తుకొచ్చారు.

స్త్రీలు భయంతో తడబడుతున్న అడుగులతో వచ్చారు.

రాములు తల్లి, భార్యా వాని ఆకారం చూసి గొల్లున, గాజుగ్లాసు బద్దలయినట్లుగా ఏడ్పు ప్రారంభించారు.

బలంగా, దృఢంగా ఉండే రాములు ఇప్పుడు—

దీనాతిదీనంగా ఉన్నాడు.

దరిద్ర్యంగా ఉన్నాడు.

అంతకంటే, బీభత్సంగా ఉన్నాడు.

అమాయకునిలా ఉన్నాడు.

అభాగ్యునిలా ఉన్నాడు.

అన్యాయంగా దౌర్జన్యానికి బలయినవానిలా ఉన్నాడు.

జుట్టు మట్టిగొట్టుకునుంది, బనీను చిరిగిపోయుంది, నల్లని మురికి శరీరం వాతలతో, రక్తపు మరకలతో ఎర్రగా ఉంది.

ముందుగా బాలిగాడు ఏడుస్తున్న ఆడవారిని ఊరోక్కండని గద్దించాడు. వాళ్ల ఏడ్పు మానలేదు కాని అందరికీ వినబడేట్లుగా కాకుండా నిశ్శబ్దంగా, నిస్సహాయంగా ఏడుస్తున్నారు.

"ఏమయిందిరా రాములుగా" అడిగాడు బాలిగాడు.

"రాజిరెడ్డి గొట్టిండే" కుళ్లి కుళ్లి ఏడ్చుతూనే జవాబిచ్చాడు.

రా....జి....రె....డ్డి....

నాలుగక్షరాలు నాలుగు బాంబుల్లా పేలాయి అందరి గుండెల్లో.

రాజిరెడ్డి రాముల్ని కొట్టిండు.

రాజిరెడ్డి ఒక్కడు పోటీగా అయితే రాముల్ని కొట్టలేడు. నిజానికి రాములు బలంముందు రాజిరెడ్డి ఎందుకూ పనికిరాడు.

రాజిరెడ్డికి అధికమైన డబ్బుంది,

అగ్రకులముంది, పైగా అధికారముంది. అందుకే అతని వెనుక ఊరుంది.

రాములుకు కష్టం చేసుకునే కండ బలముంది, నీచాల్ని సహించే కులముంది, అధికారానికి భయపడే మనస్తత్వముంది, సానుభూతి చూపే వాడ ఉంది.

రాజిరెడ్డి రాముల్ని కొట్టలేదు.

ఊరే వాడను కొట్టింది!

"ఎందుగ్గొట్టింర్రా?" అని బాలిగాడు రాముల్ని అడిగినప్పుడు—

—దగ్గరినుండి చూసే భాగ్యం ఎలాగూ లేదు, దూరాన్నుండైనా దేవున్ని చూద్దామని ఆలయ ఆవరణలోకి అడుగు పెట్టినందుకే తనను చితకతన్నిన రాజిరెడ్డి గుర్తుకొచ్చాడు మల్లిగానికి.

—పొరబాటున తన చేయి అతనికి తాకినందుకే కట్టెతో తన వీపు పగల కొట్టిన రాజిరెడ్డి గుర్తుకొచ్చాడు జంగనికి.

—న్యాయంగా తన కివ్వవలసిన కూలీ డబ్బులు ఇవ్వమని అడిగినందుకే 'నన్నెదిరించి అడుగుతావురా లం.... కొడకా' అని చెప్పుతో కొట్టిన రాజిరెడ్డి గుర్తుకొచ్చాడు నర్సింహానికి.

—కలుపు తీస్తూ వంగి ఉన్నప్పుడు తన అందాల్ని చూసి, ఆ మునిమాపటి వేళ దొడ్డిదగ్గరి ఇంట్లో తనను బలవంతంగా నలిపిపారేసిన రాజిరెడ్డి గుర్తుకొచ్చాడు చుక్కికి.

ఇలా అందులో ఎందరికో ఎన్నెన్నో సంఘటనలు గుర్తుకొచ్చాయి.

"నీవు వాళ్ల జీతగానివే గదరా—ఎందుగ్గొట్టిండు?" మళ్లీ అడిగాడు బాలిగాడు.

"బాయిల నీల్దాగినందు గ్గొట్టిండే."

"ఏంది, ఇంటికాడి బాయిల్నా?"

"కాదే, దొడ్డికాడ పెద్దబాయి లేదూ, దాంట్ల తాగిన, ఎప్పుడయినా కరెంటు మోటరు పెట్టుకోని పంపుకాడ తాగే టోన్ని. ఇయ్యాల కరెంటు లేదని దూపెక్కువయితే ఆగలేక బాయిల దిగి తాగిన్నే— గందుకే 'నీవు దీంట్ల తాగితే మేమంతా ఎట్ల తాగాలిరా లబ్డికొడకా' అని చెర్లకోల దీసుకోని ఎట్లపడితట్ల కొట్టిండే...." వెక్కుతూ చెప్పాడు రాములు.

ఊరిలోని బాయిలో నీళ్లు ముట్టకూడదంటే సహించారు కాని చేనుకు నీళ్లు పెట్టే పెద్దబాయిలో నీళ్లు త్రాగినందుకే ఇన్ని దెబ్బలా?

అందరి మనసులు కుతకుతా ఉడికి పోతున్నాయి. అంతటా గాంభీర్యమైన నిశ్శబ్దం అవహించింది. ఏం మాట్లాడాలో ఎవరికీ అర్థంకావడం లేదు. అందరి హృదయాలలో భయం, అభద్రత చోటు చేసుకొని గుబులు పుట్టిస్తున్నాయి.

గుళ్లోని దేవున్ని కనులారా చూడ్డానికి వీల్లేదు. ఊరివాళ్ల ఇంటి గడపలు దాటడానికి వీల్లేదు. ఊరి బావినీళ్లు తాగ కూడదు. ఏం హద్దుమీరినా దెబ్బలు. ముఖ్యంగా ఆ రాజిరెడ్డి!

"రాజిరెడ్డిగాన్ని తన్నాల్రా" ఆవే శంగా అన్నాడు కొండడు. ఆ నిశబ్దంలో వాడి గొంతు పిడుగులా ధ్వనించింది.

అవును! అవునవును!!

కసికసిగా పచ్చడి చేయాలి!!

నిజం! నిజం! భళిభళీ!!

వాడొక్కడే తమందరి పాలిటి శత్రువు, కౄరుడు, రాక్షసుడు.

వాన్ని చితకతన్నాలి.

తామందరిదీ అదే అభిప్రాయ మన్న ట్లుగా ఎవరూ మాట్లాడలేదు.

"ఏమంటవు మావా మాట్లాడవు, ఇట్ల దినాం అయిందానికి, కొందానికి తన్నుల్దినాలంటె ఎట్లనే, మనం మనుసు లవే గదా" రెట్టించి అడిగాడు కొండడు.

"అవునే, నాల్గు దెబ్బలు వొరుస గ్గొడ్తే పనికిరాని పసురం గూడ పొడువ నీకె ఎనిక్కి మల్తది. మనం ఇట్ల చాత గానోళ్ళలాగ కూసుంటే వాడట్లే నీల్గు తడు" అన్నాడు మల్లిగాడు.

ఇంకో అరనిమిషంపాటు మౌనం వహించి మెల్లిగా అన్నాడు బాలిగాడు "తంతే లాభమేముందిరా, వాడింకా పగ బట్టి మనల్ని బతకనీయడు."

"అయితే ఏం జేయాలంటవు?"

ఒక్కక్షణం మళ్ళీ నిశబ్దం! అందరూ చెవులు రిక్కించి వింటున్నారు బాలి గాడు చెప్పే మాట కొరకు.

"ముందుగాల ఈడున్న ఆడొళ్ళు, పిల్లలు అంతా పొండ్రి, ఎళ్లిపోండ్రి."

బాలిగాడు ఆ వాడకు పెద్ద. అందుకే ఆడవారు, పిల్లలు మారుమాటాడకుండా వెళ్లిపోయారు.

"వాడొక్కడు లేకుంటే ఈ ఊళ్ల మనల్ని ఎవడేం జేయలేడ్రా. అందుకే ...." ఒక్క క్షణం ఆగాడు. "....వాన్ని సఫాజేసిపారేయాలె, వుట్టి దెబ్బలతో లాభంలేదు" వారందరి గుండెల్లోకి ఈ మాటలు తుపాకి గుళ్లలా దూసుకు పోయాయి.


ఎవరూ మాట్లాడలేదు. ఈ మాటను వాళ్ల ఊహించలేదు. ఇన్నాళ్లూ అణిగి మణిగి ఉండి ఇంత పెద్దపనికి తెగించా లంటే అప్రయత్నంగా శరీరాలన్నీ కంపించాయి. కాని అ వెంటనే అంద రికీ రాజిరెడ్డివల్ల తాము గురయిన అవ మానాలు, అగచాట్లు గుర్తుకొచ్చాయి.

"ఏందిరా మాట్లాడకుండయితిరి ఆ రాజిరెడ్డిగాడే బతికుంటే ఈ ఊళ్ల దినాం చస్తూ మనం బతకలేం" అన్నాడు బాలిగాడు తనే.

"అవునే, మనం కష్టం జేయకుంటే ఆ కొడుకులు బతకనే బతకరు. మళ్ల మనమీదనే రువాబు చలాయిస్తరు. నీ వన్నట్లే చేద్దం పీడా పోతది" ఆవేశంగా అన్నాడు నర్సింహడు.

"మరి మీరేమంటార్రా మల్లిగా, పోసిగా...." అంటూ పేరుపేరున అడి గాడు బాలిగాడు.

"మా మనసులున్న మాట జెప్పినవు




బాలన్నా, వానితాన పైసుండొచ్చు, కులానికి గొప్పోడు కావచ్చు. అయితేమాత్రం ఇట్ల అయిం తప్పుకు, కాని తప్పుకు గొడ్లను గొట్టినట్లు కొడ్తడా?"

"మనం ఊకున్నకొద్ది వాడిట్లనే మీదికెక్కిపోతడు. ఇన్ని రోజులు ఎట్లనో ఓర్చినం, ఇంక ఊకోవద్దు...."

మిగతా అందరూ అవునన్నట్లు తల లూపారు.

వారి నిర్ణయం తనకూ ఆమోద మన్నట్లుగా చల్లని చిరుగాలితో ప్రకృతి సైతం చెట్లను ఊపింది.



* * *

ఆ ఊరిపై రాజిరెడ్డి కుటుంబానిది ఏక ఛత్రాధిపత్యమని చెప్పవచ్చు. రాజిరెడ్డి అన్న రాంరెడ్డి ఆ ఊరికి పోలీసు పటేలు. రాజిరెడ్డేమో ఈ మధ్యే గ్రామ సర్పంచుగా ఎన్నిక అయ్యాడు. అధికార బలానికితోడు వారి అర్థబలం కూడా ఎక్కువే.

అయితే రాజిరెడ్డితో పోల్చినప్పుడు అతని అన్న రాంరెడ్డి చాలా మెరుగు. అతని వల్లనే ఆ కుటుంబానికి ఆ ఊరిలో ఎంతో మర్యాద, గౌరవం లభిస్తుంది.

ప్రతిరోజూ ఉదయం అయిదు గంటలకే లేచి బావిదగ్గరున్న పొలంవైపుకు వెళ్లడం రాజిరెడ్డికి అలవాటు. రాంరెడ్డి కూడా అప్పుడే లేచినా టీ తాగాకే బయల్దేరుతాడు.

అ రోజూ మామూలుగానే లేచి ములుగర్ర పట్టుకొని బాయి దగ్గరకు వెళ్తున్నాడు రాజిరెడ్డి. మసక మసక చీకటిగా ఉన్నా అలవాటయిన దారే కాబట్టి గుబురుచెట్లతో కూడుకొని ఉన్న దొంక దారిగుండా సహజమైన వేగంతో నడుస్తున్నాడు.

ఆ చెట్ల చాటున దాగిఉన్న బాలిగాని బృందం ఏమాత్రం చప్పుడు చేయకుండా రాజిరెడ్డిపై కురికింది.

ఒక్కక్షణం అతనికేమీ అర్థం కాలేదు. కలలోనైనా ఊహించని విషయం. అందుకే తత్తరపడ్డాడు. చీకట్లో వారి ఆకారాలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. వాళ్లు ఆరుగురు. పైగా చేతుల్లో గొడ్డళ్లు, బడితెలు, గడ్డపారలు....

"కొడుకుల్లారా, ఇంతకు తెగిస్త్రా" అంటూ పెద్దగా అరచి వేగంగా కట్టె తిప్పసాగాడు.

అతని నోటిగుండా ఒక్క మాటయినా బయటకు రాకుండా పొడిచి చంపేయాలని వారి కోరిక. అందుకే వారు నోరు తెరవకుండా గొడ్డండ్లను విసురుతున్నారు, బడితెలు ఝుళిపిస్తున్నారు.


గొడ్డలి భుజానికి తాకింది. భుజం తెగిపోతున్నదేమో నన్నంత బాధ. నిస్సహాయంగా క్రింద పడిపోయాడు. అతనికి తెలిసిపోయింది. తనెలాగూ చనిపోతున్నానని. కాని ఎక్కడో మారుమూల గోరంత ఆశ. ఈ సమయంలో దారిగుండా ఎవరో రాకపోరు. అరవాలి, గట్టిగా అరవాలి అని అనుకుంటుండగానే అతన్ని కదలకుండా పట్టేశారందరూ. జంగడు గడ్డపార పైకెత్తాడు. అతనిలో చావుధైర్యం ప్రవేశించి శక్తికొలది ప్రయత్నించి ప్రక్కకు జరిగాడు. గడ్డపార భుజంలో దిగింది.

గట్టిగా అరవాలనుకున్న అతని కోరికకు అప్పుడు చెప్పరాని బాధకూడా తోడు కావడంతో పెద్దగా చావుకేక పెట్టాడు రాజిరెడ్డి.

రాంరెడ్డి భార్యకు ఆ రోజు సుస్తీగా ఉండటంతో లేచి భర్తకు టీ చేసి ఇవ్వలేకపోయింది. రాజిరెడ్డి భార్య ఆరు గంటలకు గాని లేవదు. 'బాయిదగ్గరికి పోయొచ్చి తాగుదాంలే?' అనుకొని బయల్దేరి వస్తున్న రాంరెడ్డికి రాజిరెడ్డి పెట్టిన కేకలు వినిపించాయి. రెండోసారి ఆ గొంతు తన తమ్ముడిదేనని గుర్తుపట్టాడు. అతని వెనకాలే కొంచెం దూరంలో నలుగురయిదుగురు రైతులు వస్తున్నారు. వాళ్లూ విన్నారీ కేకలు.

"అరే, ఉరికిరాండ్రా" అంటూ పంచె పైకెగదోసుకుంటూ ముందుకు పరిగెత్తాడు.

"వీడు చాన అరుస్తున్నాడు నోరు మూయించ్రా" అన్నాడు బాలిగాడు. జంగడు గడ్డపారను మరోసారి పైకెత్తాడు.




"అరేయ్" అంటూ రాంరెడ్డీ, అతని వెనుక మరో నలుగురయిదుగురు పరిగెత్తుకు రావడం చూసిన ఆ ఆరుగురికి ధైర్యం సడలిపోయింది. చిన్నప్పటి నుండి రాంరెడ్డి అంటే భయభక్తులు ఉన్నవారు కాబట్టి తెగించలేకపోయారు. అందుకే ఎవరికివారుగా పరిగెత్తుకు వెళ్ళిపోయారు.

రాంరెడ్డి వచ్చేసరికి తమ్ముడు రక్తంలో ఓలలాడుతూ కనిపించాడు. తమ్ముని కొట్టినవాళ్ళెవరో స్పష్టంగా తెలిసిపోయింది.

రాజిరెడ్డికి జరుగవలసిన శాస్తే జరిగిందని చాలామంది లోలోపలే సంతోషించినా వాడలోని జనానికి అంత తెగింపు రావడాన్ని మాత్రం ఎవరూ సహించలేకపోయారు.

మొదటి చర్యగా రాజిరెడ్డిని పట్నం ఆస్పత్రిలో చేర్చివచ్చి, ఆ సాయంత్రం తరువాత చేయవలసినదాని గురించి ఆలోచించసాగారు ఊరి పెద్దలందరు.

పోలీసు రిపోర్టు ఇవ్వడానికి ఎవరూ ఒప్పుకోలేదు.

"పోలీసు రిపోర్టిస్తే మనం చేతగానివాళ్ళమవుతాం, ఆ కొడుకులను చితకతన్నాల్సిందే."

ఇదే అందరికీ సమ్మతమయింది.

ఇంతలో—

"అదుగో బాలిగా దొస్తున్నడు" అన్నారెవరో.

నిజమే!

చేతులు మోడ్చి ఒంటరిగా వస్తు న్నాడు బాలిగాడు!!

* * *

వాడవాడంతా భయం భయంగా, ఆరాటంగా ఎదురుచూస్తుంది బాలిగాని రాక కోసం.

కాని ఇంకా రాడేం, పొద్దుమింకి చాలా సేపయింది.

ఎక్కువ ఆలోచించడానికి వారికి ధైర్యం చాలడంలేదు.

నిజానికి బాలిగాడు ఊరులోకి వెళ్ళ డానికి వాడలోనివారికి ఎవరికీ ఇష్టం లేదు. కాని "ఈరోజు మనమీదొచ్చిన కోపం రోజురోజుకు పెరుగుతది. రాం రెడ్డి పటేలు మంచోడు. నే నాయిన్ను శాంతపరుస్తా. నాకేం కాదు" అంటూ బయల్దేరాడు బాలిగాడు.

ఉదయం రాజిరెడ్డిని కొట్టి వాడలోకి వచ్చాక వారికి తమ భవిష్యత్తును తలుచు కునేసరికి శరీరంలోని అణువణువూ భయంతో జలదరించింది. రాజిరెడ్డిని చంపాలని ప్రయత్నంచేసింది వాడలోని జనం అని తెలిస్తే, ఈ ఊరిలోనే గాక చుట్టుప్రక్కల ఏ ఊర్లోనూ తమకు పని ఇవ్వరు. తము బతకలేరు. ఇదంతా ఆలోచించి రాంరెడ్డి కాళ్ళపైబడి క్షమిం చమని అడుగుదామని బయలుదేరాడతడు.

ఎవరికీ ఇష్టంలేకపోయినా గత్యం తరంలేక ఒప్పుకున్నారు.

కాని ఇంతవరకూ బాలిగాని జాడ లేదు.

అందరూ బాలిగాని ఇంటిముందు గుంపుగా, గుబులుతో నిలబడి ఉన్నారు. కాని వాడకు చివరున్న ఇంటివైపు ఏం జరుగుతున్నది ఎవరూ చూడలేదు.

ఆ గుడిసె అంటుకుని ఎర్రని మంటలు ఆకాశానికి లేచినప్పుడు "ఓలమ్మో" అంటూ అప్పుడు కంగారుగా పరిగెత్తసాగారు.

అప్పటికే సమయం మించిపోయింది. వాడను నలుదిక్కులా చుట్టుముట్టారు ఊరివారు. వాడంతా అంటుకొని పట్ట పగలైంది. హాహాకారాలు, అలజడి మిన్నుముట్టాయి.

వాడలోని వారికి దిక్కుతోచలేదు. ఎవరికి వారు తమ పిల్లల్ని, ఆస్తుల్ని రక్షించుకునే ఆత్రుతలో ఉన్నారు. రాం రెడ్డివర్గం కనిపించినవారినల్లా చితకబాదు తున్నారు. మంటల్లో ఎంతమంది చిక్కుకుపోయింది ఎవరూ పట్టించుకో లేదు.

అరగంటలో వాడంతా కాలి బూడి దగా మారి నిర్మానుష్యమైపోయింది. కాళ్లు విరిగినవారు, చేతులు తెగినవారు మూలుగుతూ అతికష్టంమీద ప్రక్క నున్న డొంకల్లోకి పారిపోయారు.

ఎవరైతే ఇన్నాళ్లూ ఒళ్లు దాచుకో కుండా కష్టంచేసి ఊరివాళ్ల గాదెల్ని, బొక్కసాల్ని నింపారో వారినే సర్వ

నాశనం చేసి విజయగర్వంగా ఊరివైపు నడిచారు రాంరెడ్డి వర్గం.

తెల్లవారేసరికి ఆ చెట్ల దాపుల్లోనే ఓ చోట కలుసుకున్నారు వాడలోని వారు. చాలామంది గాయపడే ఉన్నారు.

అప్పుడేం చేయాలో, ఎలా బ్రతకాలో, ఎక్కడ బ్రతకాలో వాళ్ళకు అర్థం కాలేదు. వాళ్ళల్లో ఎవరూ విద్యావంతులు లేరు. ఏదో దారిచెప్పే నాయకుడు బాలిగాడు లేడు. ఎక్కడున్నాడో, అసలున్నాడో లేడో, ఏమైనాడో వాళ్ళకు అంతుపట్టడం లేదు.

"పోలీసుస్టేషన్ల చెప్పుదాం పాండ్రి" అన్నాడు మల్లిగాడు. అంతకంటే వేరే మార్గం ఎవ్వరికీ కనుచూపుమేరలో కనిపించడంలేదు.

అయితే అంతకుముందే రాంరెడ్డి పోలీసుస్టేషన్‌కు వెళ్లి సబిన్స్పెక్టరును కలుసుకుని జరిగినదంతా చెప్పి డబ్బు వెదజల్లి వెళ్లాడని వాళ్ళకు తెలియదు.

మల్లిగాడు, జంగడు తదితరులంతా వెళ్లి తమ గోడు చెప్పబోయేంతలోనే "కొడుకుల్లారా మీరే రాజిరెడ్డిని చంపబోయి, పైగా రిపోర్టు చేయడానికొచ్చారా? మొదట మిమ్ముల్ని బొక్కలోకి తోస్తేగాని మీకు రోగం కుదరదు. ఏదో పాపం పేదవాళ్లని వదిలిపెడుతున్నా. నడవండి నా కళ్ల ముందునుండి" అంటూ లాఠీతో అందర్నీ బాదడం మొదలుపెట్టాడు.

మొత్తుకుంటూ ఒక్క అంగలో స్టేషన్‌లోంచి బయటపడి తమవారిని చేరుకున్నారు వారు.

వాళ్ళకేం దిక్కుతోచలేదు.

అంతా అయోమయం!

అర్థంకాని శూన్యం!

నర్సింహడు, మల్లిగాడు, జంగడు, కొండడు, చెన్నడూ అందరూ ఆలోచిస్తున్నారు. ఆడవాళ్లు సైతం ఆలోచిస్తున్నారు, చంటిపిల్లలను భయవిహ్వలతతో గుండెల కత్తుకుంటూ.

వాళ్లు మనుషులే, తమూ మనుషులమే—అందరి శరీరంలోనూ అదే ఎర్రటి రక్తం ప్రవహిస్తున్నప్పుడు వాళ్లు చేసుకున్న పుణ్యమేమిటి, తాము చేసుకున్న పాపమేమిటి? తమ శరీర కష్టంతో, శ్రమశక్తితో వాళ్లు కడుపులో చల్ల కదలకుండా తింటారు. కాని వారి దేవుడిని తమ చూడకూడదు, వారు త్రాగే నీళ్లను తము తాగకూడదు. ఎంత విచిత్రం?! ఎంతటి అన్యాయం?! ఇలా ఎన్నాళ్లు?

ఈ మతం, ఈ సంస్కృతి అపాదించిన అస్పృశ్యతే తమ పాలిట నికృష్ట శాపమై ఈ మతంలోనే తమకు బద్రత లేనప్పుడు, హీనాతిహీనంగా బ్రతుకవలసి వస్తున్నప్పుడు ఈ పనికిరాని మతం, కులం కుళ్లు మతం తమ కెందుకు? ఎందుకు??

ఆ అందరిలోనూ ఇదే ప్రశ్న!

———